TG/TEL/25/A3731

# నిజం

దృష్టి తెలుగు న్యూస్

WANTED
రిపోర్టర్లు కావలెను
నిజం దృష్టి తెలుగు న్యూస్
దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
సెల్: 9247842354

హైదరాబాద్ | ఎడిటర్: వరుదు సుజాత | సంపుటి:-1 | సంచిక:-141 | పేజీలు:-4 | ఆదివారం 03- 05 - 2026

SIMULTANEOUSLY PRINTED AT ADHILABAD I HYDERABAD |NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR| KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

## భారత్‌లో ఇరాన్ రాయబారి




- మేం యుద్ధాన్ని కోరుకోవడం లేదు, కానీ ఆపాల్సింది వారే
- యుద్ధాన్ని ఆపేందుకు ఇజ్రాయెల్, అమెరికాలపై ప్రపంచ దేశాలు ఒత్తిడి తేవాలన్న ఇరాన్
- యుద్ధం ప్రారంభించిన వారి చేతిలోనే పరిష్కార మార్గం ఉందని వ్యాఖ్య
- అమెరికా, ఇజ్రాయెల్ నిరంతరం దాడి చేయడంతో ప్రతిస్పందించటామని వెల్లడి

అమెరికాతో యుద్ధాన్ని ఇరాన్ కోరుకోవడం లేదని,ఈ ఘర్షణను నివారించేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశామని, వారు నిరంతరం దాడులు చేయడంతో తాము ప్రతిస్పందించాల్సి వచ్చిందని భారత్‌లో ఇరాన్ రాయబారి అబ్దుల్ మాజిద్ హకీమ్ ఇలాహీ పేర్కొన్నారు. ఈ యుద్ధాన్ని ఆపేందుకు ఇజ్రాయెల్, - మిగతా 2 లో

## నేను ఇరాన్‌పై యుద్ధం చేయకుంటే పశ్చిమాసియా, యూరప్ ముక్కలయ్యేవి



- ★ ఇరాన్‌పై దాడి చేసి ఆ దేశం అణ్వాయుధాలు తయారు కాకుండా అడ్డుకున్నామన్న ట్రంప్
- ★ అలా చేయకపోయి ఉంటే యూరప్ దేశాలు ముక్కలైపోయేవన్న ట్రంప్
- ★ ఇరాన్ వైమానిక, నౌకాదళాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయన్న ట్రంప్

తమతో యుద్ధం తర్వాత ఇరాన్ నాయకత్వం బలహీనపడిందని, ఆ దేశ సైనిక సామర్థ్యం గణనీయంగా క్షీణించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు ఫ్లోరిడాలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, - మిగతా 2 లో

## ఆర్టీసీ సిబ్బంది గొడవలు పెట్టుకోవద్దు

పొన్నం ప్రభాకర్ హితవు



- ★ అధికారులు డ్రైవర్లు, కండక్టర్ల పట్ల దురుసుగా ప్రవర్తించవద్దని సూచన
- ★ ప్రయాణికులతో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నమంత్రి
- ★ నష్టాల్లో ఉన్న డిపోలు సమీక్షించుకోవాలన్న మంత్రి

ఆర్టీసీ సిబ్బంది గొడవలు పెట్టుకోవడం సరికాదని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. - మిగతా 2 లో

## ఉద్యోగులకు సీఎం రేవంత్

# నాలుగు వరాలు

పీఆర్సీపై కీలక ఆదేశాలు

- ప్రభుత్వ ఉద్యోగులకు నాలుగు కీలక హామీలు ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి
- జూన్ 1 నాటికి హెల్త్ కార్డులు, 100 రోజుల్లో రూ.6000 కోట్ల బకాయిల చెల్లింపు
- వేతన సవరణపై పీఆర్సీ నివేదికను వెంటనే ఇవ్వాలని ఆదేశాలు
- ప్రభుత్వ నిర్ణయాలతో మే 5న తలపెట్టిన ధర్నాను విరమించుకున్న ఉద్యోగ సంఘాలు
- ఉద్యోగుల సమస్యల పరిష్కారం తమ బాధ్యత అని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి




తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాలుగు కీలకమైన శుభవార్తలు చెప్పారు. ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలతో శనివారం జరిగిన సమావేశంలో వారి దీర్ఘకాలిక

## రేవంత్ రెడ్డి అందుకే కవితతో పార్టీ పెట్టించారు




- కేసీఆర్‌ను కవితతో తిట్టించడానికే టీఆర్ఎస్ పుట్టిందన్న ఎంపీ
- మద్యం పాలసీ కేసులో కవితకు క్లీన్ చిట్ రాలేదన్న బీజేపీ ఎంపీ
- కవిత టీఆర్ఎస్ పార్టీతో ఎవరికీ నష్టం లేదన్న అరవింద్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను తిట్టించడానికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కవితతో పార్టీని పెట్టించారని బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ సంచలన ఆరోపణలు చేశారు. కవిత - మిగతా 2 లో

## అమెరికాతో మళ్లీ

# యుద్ధం జరగొచ్చు

### సిద్ధంగానే ఉన్నామన్న ఇరాన్

- ఇరాన్ అమెరికా మధ్య చర్చలు ఒక కొలిక్కి వచ్చే అవకాశం కనిపించడం లేదు
- చర్చలు ఎప్పుడు జరుగుతాయో, అసలు జరుగుతాయో లేదో కూడా తెలియదు
- ఈ ప్రతిపాదనలపై తాను అసంతృప్తితో ఉన్నట్లు ట్రంప్ ప్రకటించారు




ఇరాన్ అమెరికా మధ్య చర్చలు ఒక కొలిక్కి వచ్చే అవకాశం కనిపించడం లేదు. చర్చలు ఎప్పుడు జరుగుతాయో, అసలు జరుగుతాయో లేదో కూడా తెలియదు. ఈ నేపథ్యంలో ఇరు దేశాల మధ్య కాల్పులు విరమణ ఒప్పందం కూడా రద్దు కావొచ్చు. ఇదే జరిగితే, ఇరాన్-- అమెరికా మధ్య మళ్లీ యుద్ధం ప్రారంభం కావొచ్చు. అయితే, ఈ విషయంపై ఇరాన్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేసింది. ఇరాన్ డిప్యూటీ ఆఫ్ ద మిలిటరీ హెడ్‌క్వార్టర్స్ అధికారి మొహమ్మద్ జాఫర్ అసాది మాట్లాడుతూ, అమెరికా-- ఇరాన్ మధ్య యుద్ధం ప్రారంభం కావొచ్చని అభిప్రాయపడ్డారు. ఇరు దేశాల మధ్య ఒప్పందం విషయంలో అమెరికా అంత ఆసక్తిగా లేదని, దీంతో యుద్ధం తప్పకపోవచ్చని ఆయన అన్నారు. అమెరికా ఇటీవల తీసుకుంటున్న చర్యలు, ప్రకటనలు చూస్తే ద్వైపాక్షిక అంశాలపై అమెరికాకు చిత్తశుద్ధి లేదనే విషయం స్పష్టమవుతోందన్నారు. అమెరికా ఇటీవల చేసిన ప్రకటనలు ముందుగా చమురు ధరలు తగ్గించేందుకేనని, అలాగే వాళ్ళు సృష్టించిన గందరగోళాన్ని

## 180కి పైగా సీట్లు గెలుస్తాం



- విజయ్ ముఖ్యమంత్రి అవుతారు: టీవీకే పార్టీ
- విజయ్ దూరదృష్టితో రాష్ట్రాన్ని పాలిస్తారన్న టీవీకే పార్టీ
- ఎన్నికల అనంతరంపొత్తు వార్తలను కొట్టిపారేసిన టీవీకే పార్టీ
- విజయ్ దూరదృష్టితో రాష్ట్రాన్ని పాలిస్తారని వ్యాఖ్య

తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో, విజయ్ నేతృత్వంలోని తమ పార్టీ 234 స్థానాలకు గాను 180 నుంచి 200 - మిగతా 2 లో

## రేపు నీట్-యూజీ పరీక్ష

విద్యార్థులూ... ఇవి గుర్తు పెట్టుకోండి!




పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు పరీక్ష కేంద్రాల వద్ద అమలులో బీఎన్ఎస్ఎస్‌లోని 163 సెక్షన్100 మీటర్ల దూరంలో జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్ల మూసివేత దేశవ్యాప్తంగా రేపు జరగనున్న నీట్-యూజీ పరీక్షకు ఎన్టీఏ అధికారులు ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. - మిగతా 2 లో

## బెంగాల్‌లో బీజేపీ గెలుస్తుందన్న ఎగ్జిట్ పోల్స్

స్పందించిన మమతా బెనర్జీ

- ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను తోసిపుచ్చిన మమతా బెనర్జీ
- తృణమూల్ కాంగ్రెస్ 200 సీట్లు గెలుచుకుంటుందని ధీమా



టీఎంసీ కార్యకర్తలపై కేంద్ర బలగాలు దాడులు చేస్తున్నాయని ఆరోపణ పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ విజయం సాధిస్తుందన్న ఎగ్జిట్ పోల్స్ ఫలితాలపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ స్పందించారు. ఎగ్జిట్ పోల్ ఫలితాలను ఆమె తోసిపుచ్చారు. - మిగతా 2 లో

## సింగపూర్ పర్యటనకు ఏపీ బెస్ట్ టీచర్లు

మంత్రి నారా లోకేష్ స్పందన



- శిక్షణ కోసం సింగపూర్‌కు 37 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సింగపూర్‌లో 5 రోజుల ప్రత్యేక కార్యక్రమం
- ఆధునిక బోధన పద్ధతులపై టీచర్లకు శిక్షణ
- ఉపాధ్యాయులు అభివృద్ధి చెందితే తరగతి గది మారుతుందన్న మంత్రి లోకేష్

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా రాష్ట్ర - మిగతా 2 లో

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

# కీలక నిర్ణయం

- ఇకపై వాట్సాప్‌లోనే మెడికల్ కౌన్సిల్ సేవలు
- ఏపీలోని కూటమి సర్కార్ ప్రజలకు మరింత ఈజీగా వైద్య సేవలు
- అందించేందుకు మరో ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది.
- ఆధునిక టెక్నాలజీని వినియోగిస్తూ.. ఏపీ మెడికల్ కౌన్సిల్ సేవలను ఇప్పుడు వాట్సాప్ ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చింది.




పూర్తి వివరాల్లోకి వెళ్తే. అందించేందుకు మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ (AMC) సేవలను ఇప్పుడు వాట్సాప్ ద్వారా

## వాణిజ్య గ్యాస్ ధరల పెంపుపై ప్రధాని మోదీపై షర్మిల ఫైర్



- ఎన్నికల తర్వాత ప్రజలపై భారం మోపడం మోదీకి అలవాటు
- ఒకేసారి రూ. 993 పెంచి సామాన్యుల నడ్డి విరిచారని ఆరోపణ
- పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్
- ఈ అద్భుత ఘనకార్యానికి గుర్తుగా దేశంలోని మ్యూజియంలలో మోదీ పేరును సువర్ణాక్షరాలతో రాయించాలి

వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలను భారీగా పెంచడంపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ - మిగతా 2 లో

# సింగపూర్ పర్యటనకు ఏపీ బెస్ట్ టీచర్లు

మొదటిపేజీ తరువాయి - ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 37 మంది ఉత్తమ ప్రభుత్వ ఉపాధ్యాయులను ప్రత్యేక శిక్షణ కోసం సింగపూర్‌కు పంపింది. ఈ బృందం సింగపూర్ పర్యటనకు వెళ్లడం పట్ల విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో భాగంగా ఉపాధ్యాయులు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సింగపూర్‌లో ఐదు రోజుల పాటు జరిగే ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో పాల్గొంటారు. ఆధునిక బోధన పద్ధతులు, విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచనను (క్రిటికల్ థింకింగ్) పెంపొందించడం, విద్యార్థి కేంద్రిత బోధన వంటి అంశాలపై వీరికి లోతైన అవగాహన కల్పించనున్నారు. ప్రపంచ స్థాయి ఉత్తమ విద్యా విధానాలను నేర్చుకుని, వాటిని రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని మంత్రి లోకేష్ వివరించారు. "ఉపాధ్యాయులు అభివృద్ధి చెందితేనే తరగతి గది రూపాంతరం చెందుతుంది" అనే బలమైన ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన తెలిపారు. ఈ అంతర్జాతీయ శిక్షణ ద్వారా ఉపాధ్యాయుల నైపుణ్యాలు మెరుగుపడి, రాష్ట్ర విద్యా వ్యవస్థ మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటుందని లోకేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆర్టీసీ సిబ్బంది గొడవలు పెట్టుకోవద్దు

మొదటిపేజీ తరువాయి - ఆర్టీసీ అధికారులు కూడా కిందిస్థాయి డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించవద్దని అన్నారు. స్నేహపూర్వకంగా ఉండి వారితో పనిచేయించుకోవాలని తెలిపారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, డిపో మేనేజర్లు, ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులతో సత్సంబంధాలు కలిగి ఉండాలని అన్నారు. ఖమ్మం, మెదక్, నారాయణఖేడ్, బాన్సువాడ, ఇల్లెందు లాంటి కొన్ని డిపోలు ఎందుకు నష్టాల్లో నడుస్తున్నాయో ఆర్ఎంలు, డిపో మేనేజర్‌లు సమీక్షించాలని ఆదేశించారు. ఆర్టీసీ యాజమాన్యం సిబ్బంది సమస్యలు సావధానంగా వినాలని సూచించారు. టిక్కెట్లకు సంబంధించి ఏదైనా ఇబ్బందులు, సమస్యలు ఏర్పడితే వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు.

# భారత్‌లో ఇరాన్ రాయబారి

మొదటిపేజీ తరువాయి - అమెరికాలపై ప్రపంచ దేశాలు ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో యుద్ధం లేని, శాంతి లేని పరిస్థితి నెలకొందని అన్నారు. సాధారణ పరిస్థితి నెలకొనాలా, వద్దా అనే విషయం ఈ యుద్ధం ప్రారంభించిన వారి చేతిలోనే ఉందని స్పష్టం చేశారు. ఇరాన్ మాత్రం యుద్ధాన్ని కోరుకోవడం లేదని అన్నారు. అమెరికా, ఇజ్రాయెల్ నిరంతరం దాడులు చేయడంతో తాము ప్రతిస్పందించాల్సి వచ్చిందని అన్నారు. దాడులు చేసే అధికారం వాళ్లకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. చర్చల సమయంలోనే సుప్రీం లీడర్ సహా అనేకమంది మరణానికి వారు కారణమయ్యారని మండిపడ్డారు. చిన్నారులు, సామాన్యులను ఎంతో మందిని చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యుద్ధం వల్ల నాలుగు వేలమంది చనిపోగా, 40 వేల ఇరాన్ పౌరులు గాయపడినట్లు చెప్పారు. తమ దేశంలో ఎన్నో మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయని అన్నారు. తాము బేషరతుగా లొంగిపోవాలని వారు చెబుతున్నారని, దానిని అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. ఈ యుద్ధం వల్ల ప్రపంచదేశాలు ఇబ్బంది పడుతున్నాయని అన్నారు. ఇరాన్ ప్రభుత్వాన్ని కూల్చివేయాలనే వారి లక్ష్యం నెరవేరదని వ్యాఖ్యానించారు.

# రేవంత్ రెడ్డి అందుకే కవితతో పార్టీ పెట్టించారు

మొదటిపేజీ తరువాయి - స్థాపించిన 'టీఆర్ఎస్' ప్రభావం కేసీఆర్, కేటీఆర్ పైనే ఉంటుందని అన్నారు. ఇక ఏ పార్టీపై ప్రభావం ఉండదని అభిప్రాయపడ్డారు. కవిత పార్టీకి రేవంత్ రెడ్డి అండ ఉందని ఆరోపించారు. మద్యం పాలసీ కేసులో ఆమెకు క్లీన్ చిట్ రాలేదని గుర్తు చేశారు. ప్రస్తుతం సీబీఐ విచారణ కొనసాగుతోందని తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కవిత టీఆర్ఎస్ పార్టీతో ఎవరి పైనా ప్రభావం ఉండదని అన్నారు. బీజేపీకి మాత్రం మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ నెల 10న తెలంగాణలో మోదీ పర్యటన ఉందని అన్నారు. మోదీ పర్యటనతో కేసీఆర్, రేవంత్ రెడ్డితో పాటు ఆయా పార్టీల్లో వణుకు పుడుతోందని విమర్శించారు. 2028 ఎన్నికలకు నాంది ఈ మోదీ పర్యటన అన్నారు. బీజేపీ ఇప్పటికే దేశమంతా జెండా ఎగురవేసిందని, ఇప్పుడు పశ్చిమ బెంగాల్‌లోనూ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ వరుస విజయాలతో ప్రాంతీయ పార్టీల్లో వణుకు ఖాయమని అన్నారు. బీజేపీ తదుపరి లక్ష్యం తెలంగాణ అన్నారు. ప్రాంతీయ పార్టీల్లో ప్రస్తుతం అభద్రతాభావం నెలకొని ఉందని, మరోవైపు కాంగ్రెస్ పార్టీని ప్రజలు మరిచిపోయారని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెడితే విపక్షాలు వ్యతిరేకించాయని మండిపడ్డారు. దీనితో మహిళ బిల్లుకు ఎవరు వ్యతిరేకమో ప్రజలకు తెలిసిందని అన్నారు. ప్రధాని మోదీకి తెలంగాణ ప్రజలపై అమితమైన ప్రేమ ఉందని అన్నారు.ల

# రేపు నీట్-యూజీ పరీక్ష

మొదటిపేజీ తరువాయి - నీట్ పరీక్ష నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్‌లోని 163 సెక్షన్ అమలులో ఉంటుంది. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పరీక్ష కేంద్రాల వద్ద ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సెక్షన్ 163 అమలులో ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ మేరకు ఒక పబ్లిక్ నోటీసు విడుదల చేశారు. ఈ నోటీసు ప్రకారం, పరీక్ష కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో ఐదుగురు అంతకన్నా ఎక్కువమంది గుమికూడటం నిషిద్ధం. పరీక్ష కేంద్రానికి 100 మీటర్ల పరిధిలోని జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను మూసివేయాలి. పరీక్ష సజావుగా సాగేందుకు అందరూ సహకరించాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ కోరారు. ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా జరిగే ఈ పరీక్షకు సుమారు 22.79 లక్షలమందికి పైగా విద్యార్థులు హాజరు కానున్నారు. రేపు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ పరీక్ష కోసం విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. మధ్యాహ్నం 1.30 గంటలకు పరీక్ష కేంద్రం మూసివేస్తారు. ఆదివారం కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉన్నందున విద్యార్థులు అందుకు అనుగుణంగా ఏర్పాటు చేసుకోవాలని ఎన్‌టీఏ ఒక అడ్వైజరీ జారీ చేసింది. అడ్మిట్ కార్డు, ఫొటో గ్రాఫ్ తడిచిపోకుండా ట్రాన్స్‌పరెంట్ పౌచ్‌లు ఉపయోగించాలని సూచించింది.

# బెంగాల్‌లో బీజేపీ గెలుస్తుందన్న ఎగ్జిట్ పోల్స్

మొదటిపేజీ తరువాయి - కౌంటింగ్ ఏజెంట్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ, టీఎంసీ తప్పకుండా ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తృణమూల్ కాంగ్రెస్ 200కు పైగా సీట్లు గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఎగ్జిట్ పోల్స్ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాయని, 2021, 2024లోనూ అలాగే చేశాయని అన్నారు. స్టాక్ మార్కెట్‌ను తారుమారు చేయడానికే ఎగ్జిట్ పోల్స్ తప్పుడు ప్రచారాలని ఆరోపించారు. ఇప్పుడు కూడా అదే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. టీఎంసీ కార్యకర్తలపై కేంద్ర బలగాలు దాడులు చేస్తున్నాయని ఆరోపించారు. తమ ప్రభుత్వం వచ్చాక వారి సంగతి చూస్తామని హెచ్చరించారు.

# నేను ఇరాన్‌పై యుద్ధం చేయకుంటే పశ్చిమాసియా, యూరప్ ముక్కలయ్యేవి

మొదటిపేజీ తరువాయి - ఇరాన్‌పై దాడి చేసి ఆ దేశం అణ్వాయుధాలను తయారు చేయకుండా అడ్డుకున్నామని తెలిపారు. ఒకవేళ తాను అలా చేయకపోయి ఉంటే పశ్చిమాసియా, యూరప్ దేశాలు ముక్కలైపోయేవని అన్నారు. ఇరాన్ అనే అందమైన దేశంలోకి వెళ్లి వారి వద్ద అణ్వాయుధాలు లేవని మనం నిర్ధారించుకోవాలని వ్యాఖ్యానించారు. బీ2 బాంబర్లతో వారిని అడ్డుకున్నట్లు చెప్పారు. అమెరికా అలా చేయకపోయి ఉంటే వారి వద్ద అణ్వాయుధాలు ఉండేవని, అప్పుడు ఇజ్రాయెల్, పశ్చిమాసియాతో సహా యూరప్ దేశాలు ముక్కలుగా పేలిపోయి ఉండేవని వ్యాఖ్యానించారు. తమ సైనిక చర్యతో ఇరాన్ నాశనమైందని అన్నారు. వారి వైమానిక, నౌకాదళాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయని అన్నారు. శాంతిచర్చలు తాను ఆశించినవిధంగా జరగడం లేదని అన్నారు. యుద్ధం కారణంగా చమురు ధరలు పెరిగాయని, యుద్ధం ఆగిపోతే తగ్గుతాయని పేర్కొన్నారు. ఇరాన్ తమతో ఒప్పందం చేసుకోవాలనుకుంటోందని కానీ వారి ప్రతిపాదన సంతృప్తికరంగా లేదని అన్నారు. ఇరాన్‌లో నాయకత్వం విచ్ఛిన్నం అయిందని, అక్కడ నాలుగైదు గ్రూపులు ఉన్నాయని, అందుకే ఒప్పందం విషయంలో గందరగోళం నెలకొందని అన్నారు.

# అమెరికాతో మళ్లీ యుద్ధం జరగొచ్చు

మొదటిపేజీ తరువాయి - తగ్గించేందుకే అని అసాది అన్నారు. చర్చల విషయంలో అమెరికాకు చిత్తశుద్ధి లేకపోవడంతో అమెరికాతో తమ దేశానికి మళ్లీ యుద్ధం తప్పకపోవచ్చని వ్యాఖ్యానించారు. అందుకే యుద్ధం వచ్చినా ఎదుర్కొనేందుకు తమ సైనిక దళాలు పూర్తి సిద్ధంగా, హై అలర్ట్‌తో ఉన్నాయని తెలిపారు. ఇరు దేశాల మధ్య తాజా చర్చల అంశంలో ఇరాన్ చేసిన ప్రతిపాదనలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తోసిపుచ్చిన సంగతి తెలిసిందే. ఈ ప్రతిపాదనలపై తాను అసంతృప్తితో ఉన్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే ఇరాన్ నుంచి తాజా ప్రకటన వెలువడింది.

# ఉద్యోగులకు సీఎం రేవంత్ నాలుగు వరాలు

మొదటిపేజీ తరువాయి - డిమాండ్లపై సానుకూలంగా స్పందించారు. ఈ నిర్ణయాలతో సంతృప్తి చెందిన ఉద్యోగ సంఘాలు, మే 5న తలపెట్టిన ధర్నాతో పాటు ఇతర నిరసన కార్యక్రమాలను విరమించుకుంటున్నట్లు ప్రకటించాయి. సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో ఉద్యోగుల సేవలను సీఎం ఈ సందర్భంగా అభినందించారు.

**జూన్ 1 నాటికి హెల్త్ కార్డులు**

ఉద్యోగులందరికీ ఆరోగ్య భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు జారీ చేయాలన్న ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం, జూన్ 1వ తేదీ నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేసి కార్డులు అందజేస్తుందని స్పష్టం చేశారు.

**100 రోజుల్లో రూ.6000 కోట్ల బకాయిల చెల్లింపు**

పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిల విషయంలో ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాబోయే 100 రోజుల్లో రూ.6,000 కోట్లను విడుదల చేయనున్నట్లు సీఎం ప్రకటించారు. ఈ నిధులను ఏ ప్రాధాన్యతా క్రమంలో ఎవరికి ముందుగా చెల్లించాలనే నిర్ణయాన్ని ఉద్యోగ సంఘాలకే వదిలివేస్తున్నట్లు ఆయన తెలపడం విశేషం.

**పీఆర్సీ నివేదికపై తక్షణ ఆదేశం**

ప్రభుత్వ ఉద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న వేతన సవరణ (పీఆర్సీ) అంశంపైనా సీఎం స్పష్టత ఇచ్చారు. పీఆర్సీ నివేదికను తక్షణమే ప్రభుత్వానికి సమర్పించాలని సంబంధిత కమిషన్‌ను ఆదేశించారు. నివేదిక అందిన వెంటనే జీతాల పెంపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని, ఇందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు 67,760 ఉద్యోగాలను భర్తీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు.

**రెండు నెలలకోసారి సమావేశం**

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతర సంప్రదింపుల ప్రక్రియను ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం తెలిపారు. ఇకపై ప్రతి రెండు నెలలకోసారి ఉద్యోగ సంఘాలు సమావేశమై, తమ సమస్యలు, ఆందోళనలపై ప్రభుత్వానికి ఒక నివేదిక సమర్పించాలని సూచించారు. "ఇది ఉద్యోగ స్నేహపూర్వక ప్రభుత్వం, మీ సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత మాపై ఉంది" అని ఆయన భరోసా ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి నెలా 1వ తేదీన జీతాలు చెల్లించడం, గందరగోళం లేకుండా ఉపాధ్యాయ బదిలీలు చేపట్టడం వంటి చర్యలను ఆయన గుర్తుచేశారు.

# ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం

మొదటిపేజీ తరువాయి - అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇకపై ప్రజలు మరియు వైద్యులు 'మనమిత్ర' వాట్సాప్ నెంబర్ 9552300009 ద్వారా ఏపీ మెడికల్ కౌన్సిల్ సేవలను పొందవచ్చు. అయితేఈ సేవలను వినియోగించుకోవాలంటే, వాట్సాప్‌లో 9552300009 నెంబర్‌కి "హాయ్" లేదా "హాయ్" అని మెసేజ్ పంపితే సరిపోతుంది. తరువాత వచ్చే మెనూలో ఆరోగ్య శాఖ ఆప్షన్‌ను ఎంచుకుని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ సేవలను ఈజీగా పొందవచ్చు. ఈ కొత్త విధానం ద్వారా డాక్టర్ల రిజిస్ట్రేషన్ వివరాలు, వారి దరఖాస్తుల స్థితి వంటి కీలక సమాచారం.. ఇప్పుడు మీ మొబైల్ ఫోన్లలోనే అందుబాటులో ఉంటుంది. అంతేకాకుండా రాబోయే CME (Continuing Medical Education) కార్యక్రమాలు, క్రెడిట్ పాయింట్ల వివరాలు కూడా ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా తెలుసుకోవచ్చు. ఇక ప్రజలకు మరింత ఉపయోగకరంగా, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న ఓపీ సేవలు, రక్త లభ్యతపై కూడా ఈ వాట్సాప్ సేవ ద్వారా సమాచారం పొందవచ్చు. అంతేకాకుండా హాస్పిటల్స్‌లో మందులు, శస్త్రచికిత్సకు అవసరమైన సామగ్రి లభ్యతపై కూడా సులభంగా ఆరా తీసే అవకాశం కల్పించింది. ఈ విధంగా, వైద్యులు మరియు ప్రజలకు ఒకే వేదికపై అవసరమైన సమాచారాన్ని అందిస్తూ.. పౌరసేవలను మరింత సులభతరం చేసే దిశగా సీఎం చంద్రబాబు సర్కార్ ముందడుగు వేసింది. కాగా ఈ నిర్ణయం డిజిటల్ సేవల విస్తరణలో ఒక ముఖ్యమైన అడుగుగా భావిస్తున్నారు.

# రెండు వారాల పాటు మైదాను తినడం మానేస్తే శరీరంలో జరిగే మార్పులు ఇవే



మనకు తెలియకుండానే రోజువారీ ఆహారంలో భాగమైపోయిన పదార్థం. బ్రెడ్, బిస్కెట్లు, నూడుల్స్, కేకులు, పేస్ట్రీలు వంటి అనేక వంటకాలలో దీన్ని విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. రుచిగా ఉన్నప్పటికీ, ఇందులో పోషకాలు తక్కువగా ఉండటం, జీర్ణక్రియపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉండడంతో, ఆరోగ్య నిపుణులు దీనిని పరిమితం చేయాలని సూచిస్తున్నారు. అందుకే కొందరు కొంతకాలం మైదాను పూర్తిగా మానేసి శరీరంలో వచ్చే మార్పులను గమనిస్తున్నారు. కేవలం రెండు వారాల పాటు మైదా తీసుకోకుండా ఉంటే కొన్ని స్పష్టమైన మార్పులు కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

**జీర్ణ వ్యవస్థకు..**

మైదాను ఆహారం నుంచి తొలగించడంతో జీర్ణక్రియలో మెరుగుదల కనిపిస్తుంది. ఫైబర్ లేని మైదా జీర్ణక్రియను మందగింపజేస్తుంది. దానికి బదులుగా సంపూర్ణ ధాన్యాలు, పండ్లు, కూరగాయలు తీసుకుంటే ఉబ్బరం తగ్గి, పొట్ట తేలికగా అనిపిస్తుంది. అలాగే శక్తి స్థాయిలు స్థిరంగా మారుతాయి. మైదాతో తయారైన పదార్థాలు రక్తంలో చక్కెరను వేగంగా పెంచి, వెంటనే తగ్గిస్తాయి. దీంతో అలసట, నీరసం వస్తాయి. మైదా మానేయడం వల్ల ఈ మార్పులు తగ్గి, శక్తి స్థాయి సంతులితంగా ఉంటుంది. ఆకలి కూడా నియంత్రణలోకి వస్తుంది. మైదా ఎక్కువసేపు తృప్తిని ఇవ్వదు కాబట్టి తరచూ తినాలనిపిస్తుంది. కానీ ఫైబర్, ప్రోటీన్ ఉన్న ఆహారం తీసుకుంటే ఎక్కువసేపు నిండుగా అనిపించి అనవసరంగా తినడం తగ్గుతుంది. బరువు నియంత్రణలో కూడా ఇది సహాయపడుతుంది.

**చర్మ సంరక్షణకు..**

మైదా పదార్థాల్లో ఎక్కువగా ఖాళీ క్యాలరీలు, చక్కెరలు, కొవ్వు ఉంటాయి. వీటిని తగ్గించడం వల్ల అదనపు క్యాలరీలు తగ్గి, కొంతవరకు బరువు నియంత్రణలోకి వస్తుంది. ఉబ్బరం కూడా తగ్గినట్లు అనిపిస్తుంది. చర్మంపై కూడా స్వల్ప మార్పులు కనిపిస్తాయి. ప్రాసెస్డ్ ఆహారం తగ్గించడంతో శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ తగ్గి, మొటిమలు లేదా చర్మ సమస్యలు తగ్గే అవకాశం ఉంటుంది. మైదా మానేసిన మొదటి రోజుల్లో తినాలనే కోరికలు పెరగవచ్చు. ముఖ్యంగా బ్రెడ్, బేకరీ పదార్థాలు ఎక్కువగా తీసుకునే వారికి ఇది సహజమే. అయితే కొద్ది రోజుల్లోనే శరీరం అలవాటు పడడంతో ఈ కోరికలు తగ్గిపోతాయి. మైదా పిండిని మానేయడం వల్ల ఈ విధంగా మన శరీరంలో అనేక మార్పులు కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

**వీటిని తీసుకోవాలి..**

మైదాను మానేటప్పుడు దానికి బదులుగా సంపూర్ణ గోధుమలు, జొన్నలు, రాగులు, ఓట్స్, పప్పులు వంటి పోషకాహారం తీసుకోవడం అవసరం. కేవలం మైదాను మానేయడం సరిపోదు, మొత్తం ఆహార నాణ్యతను మెరుగుపరచడం ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. రెండు వారాల పాటు మైదాను దూరం పెట్టడం ద్వారా శరీరంలో వచ్చే చిన్న మార్పులను గమనించవచ్చు. ఇది కఠిన నియమం కాదు, కానీ మన ఆహారం శరీరంపై ఎలా ప్రభావం చూపుతుందో అర్థం చేసుకునేందుకు మంచి అవకాశమని నిపుణులు సూచిస్తున్నారు.

# అమెరికాలో ఉండలేం.. ఇండియాకు వస్తాం!

విద్య, ఉద్యోగాల కోసం చాలామంది భారతీయులు అమెరికాకు వెళ్తున్నారు. అమెరికన్ డ్రీమ్, వృత్తిపరమైన నైపుణ్యాభివృద్ధి సాధించాలనే తపనతో, ఉత్తమ పనితీరు కలిగిన ఐటీ, ఆరోగ్య సంరక్షణ, కార్మిక నిపుణులుగా రాణిస్తున్నారు. విజయవంతమైన భవిష్యత్తును నిర్మించుకునేందుకు హెచ్1బీ వీసాలను ఉపయోగించుకున్నారు. భారతీయ విద్యార్థులు అమెరికాలోని అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల్లో చదువుకోవాలనే కోరికతో ఖర్చుకు వెనుకాడకుండా అక్కడికి వెళ్లాలని ప్రయత్నాలు చేస్తుంటారు. కొందరు సఫలమైతే మరికొందరు విఫలమవుతున్నారు. కానీ ఇటీవల భారతీయుల్లో అమెరికా కల చెదిరిపోతున్నది. అమెరికాలో ఉండలేమని, ఇండియాకు తిరిగి వస్తామని చాలామంది చెప్తున్నారు. ఎన్నో కష్టానష్టాలను భరించి అమెరికా వెళ్లిన భారతీయులు అక్కడి స్థానికుల నుంచి అవమానాలు, ఆటంకాలను అధిగమించి, మెరుగైన పనితీరుతో రాణిస్తున్నారు. సముచిత స్థానాన్ని సంపాదించుకున్నారు. అమెరికాలో పారిశ్రామికవేత్తలుగా, వ్యవస్థాపకులుగా టెక్నాలజీ, ఫైనాన్స్, తయారీ రంగాల్లోని సంస్థలకు నాయకత్వం వహిస్తున్నారు. భారతీయ సంతతి కుటుంబాల సగటు ఆదాయం అత్యధికం 119000 అమెరికా డాలర్లు. 2026 నాటికి అమెరికాలో జన్మించిన, అమెరికాకు వలస వెళ్లిన వారు కలిపి 54 లక్షల మంది భారతీయులు నివసిస్తున్నారు. ఇది అమెరికా జనాభాలో 1.5%. సంఖ్యాపరంగా, ఆర్థికపరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆసియా సమూహాల్లో భారత సంతతి ఒకటి. కాలిఫోర్నియా, టెక్సాస్, న్యూ జెర్సీ, న్యూయార్క్‌లలో భారత సంతతి ప్రజలెక్కువ. అమెరికాలోని వైద్యుల్లో 10% మంది భారతీయులే. అమెరికాలో మన వాళ్లు ఎంతగా రాణించినప్పటికీ వారు చాలా సవాళ్లను ఎదుర్కొంటున్నారు. కార్నెగి నిర్వహించిన సర్వేలో ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి. అమెరికాను వదలాలని అక్కడి భారత సంతతిలోని 40% మంది కోరుకుంటున్నారని అధ్యయనం వెల్లడించింది. ఒకప్పుడు అమెరికాలో ఉద్యోగం సంపాదించడం, స్థిర నివాసం ఏర్పరచుకోవడం చాలామంది కల, కానీ ప్రస్తుతం ఆ కల చెదిరిపోతున్నది. అగ్రరాజ్యంలో ఉండలేని దుస్థితి నెలకొన్నదని భారతీయుల వేదన. అక్కడి పరిస్థితుల కారణంగా రోజురోజుకు వారిలో ఆందోళన, భయం పెరిగి, భారత్‌కు రావాలని కోరుకుంటున్నారు. అక్కడి రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులే కారణమని చెప్తున్నారు. యూగవ్, కార్నెగి ఎండోమెంట్స్ సంస్థ 1,000 మంది భారతీయులను సర్వే చేసి అభిప్రాయం సేకరించగా 40% భారతీయ అమెరికన్లు భారత్ వెళ్లిపోతామని వెల్లడించగా, 14% మంది వెళ్లిపోవాలని తరచుగా ఆలోచిస్తున్నామని, 28% మంది అప్పుడప్పుడు అలా అనిపిస్తుందని చెప్పారు.



ప్రస్తు తం అమెరికాలో జరుగుతున్న రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ విధానాలపై అక్కడ ఉన్న భారతీయుల్లో 58% మంది తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. పెరిగిన జీవన వ్యయాన్ని భరించలేకపోతున్నామని 54% మంది తెలిపారు. రోజు రోజుకు వ్యక్తిగత భద్రత కష్టంగా ఉన్నదని 41% చెప్పారు. మొదటిసారి ట్రంప్ అధ్యక్షుడైనప్పుడు అతడు భారతదేశం పట్ల సానుకూలంగా ఉంటారని అక్కడి ఎన్ఆర్ఐలు భావించారు. కానీ రెండోసారి అధ్యక్షుడయ్యాక ఆర్థిక వ్యవస్థ నిర్వహణ, వలస విధానాలు, అంతర్జాతీయ సంబంధాల్లో ప్రభుత్వ నిర్ణయాలు తమకు నచ్చడం లేదని 71% మంది వెల్లడించారు. ట్రంప్ జాత్యహంకార మాటలు మాట్లాడుతూ, అమెరికన్స్ ఫస్ట్ అంటూ, మేక్ అమెరికా గ్రేట్ అగైన్ అని రకరకాలుగా ప్రకటనలు చేస్తూ అమెరికన్లనే కాకుండా అమెరికాలో స్థిరపడిన, పనిచేస్తున్న, చదువుకుంటున్న విదేశీయులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని పలువురు చెప్తున్నారు. ట్రంప్‌కు అమెరికా ప్రజల్లో 38% గా ఉన్న ఆదరణ 30% కి పడిపోయిందని విశ్లేషకులు చెప్తున్నారు. ఇక మరి కొన్ని సంస్థల అధ్యయనంలోనూ (రాయిటర్స్ ఇప్సోస్-35%, ఏపీ-ఎన్‌వోఆర్సీ సెంటర్ ఫర్ పబ్లిక్ అఫైర్స్ రీసెర్చ్-35%, స్ట్రెంత్ ఇన్ నంబర్స్ వెరా సైట్-33%) ట్రంప్‌కు మద్దతు తగ్గుతున్నట్టు వెల్లడయింది. ఇరాన్‌తో యుద్ధం, పడిపోతున్న ఆర్థిక వ్యవస్థల నిర్వహణ, వలసలు వంటి విషయాల్లో ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలకు ప్రజామోదం లేదని పైన పేర్కొన్న 3 సంస్థలు తెలిపాయి. ముఖ్యంగా ఆర్థిక విషయాల్లో అమెరికన్లకు అసంతృప్తి అధికంగా ఉన్నట్టు కనిపిస్తున్నది. అమెరికా ఆర్థిక వ్యవస్థ దారుణంగా ఉన్నదని ఈ వారం ప్రారంభంలో నిర్వహించిన సర్వేలో పాల్గొన్న 70% మంది ప్రజలు తెలిపినట్టు ఏపీ ఎన్‌వోఆర్సీ సంస్థ వెల్లడించింది దేశం సరైన పంథాలో సాగడం లేదని 72% మంది అభిప్రాయపడినట్టు తెలియజేసింది. ఆర్థిక వ్యవహారాల నిర్వహణలో మార్చి నెలలో ట్రంప్‌కు ఉన్న ప్రజాదరణ 38%, కానీ ఏప్రిల్ నాటికి అది 30%కు పడిపోయింది. జీవన వ్యయం విషయంలో కేవలం 23% మంది మాత్రమే ట్రంప్‌కు అనుకూల, 76% మంది ట్రంప్‌కు వ్యతిరేక అభిప్రాయం చెప్పారు. వీటికి తోడు ఈ మధ్యనే జార్జియా, ఫ్లోరిడా రాష్ట్రాలలో కార్చిచ్చు కమ్మేసింది. భారత్ నుండి అమెరికా వెళ్లే వారిని అన్ని మాఫియా గ్యాంగ్ స్టర్ల కంటే ఎక్కువ నష్టం చేసి, మనల్ని ద్వితీయ శ్రేణి పౌరులుగా చేసి దోచుకొని అమెరికాకు నష్టం కలిగిస్తున్న 'గ్యాంగ్ స్టర్స్ విత్ లాప్టాప్" అని, మైకేల్ శావెజ్ అనే రాజకీయ విశ్లేషకుడు చేసిన పాడ్‌కాస్ట్‌ను ట్రంప్ సొంత సామాజిక మాధ్యమమైన ట్రూత్ సోషల్‌లో రీపోస్ట్ చేశారు. దాదాపు 10 నిమిషాల నిడివిగల వీడియోలో జాత్యహంకారపూరిత వ్యాఖ్యలు చేశారు. తమ పిల్లలు అమెరికాలో పుట్టేలా 9 నెలల గర్భంతో ఉన్న వారిని చైనా/ ఇండియా నుంచి అమెరికాకు తీసుకొస్తున్నారు. ఇక్కడ పుట్టి అమెరికా జాతీయ పౌరులైపోతున్నారు. ఇక్కడ పుట్టిన బేబీకి చట్టబద్ధంగా లభించే పౌరసత్వాన్ని ఆధారంగా చేసుకొని తమ మొత్తం కుటుంబాన్ని భారత్/చైనా నుంచో, భూగోళంపైనున్న మరో నరకప్రాయ దేశం నుంచో ఇక్కడికి తెస్తారు. అందుకే అమెరికా బర్త్ రైట్ సిటిజన్‌షిప్‌లో మార్పులు చేయాలి. అమెరికా రాజ్యాంగాన్ని సవరించాలి అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇక్కడ గమనించవలసిన విషయం ఏంటంటే భావప్రకటనా స్వేచ్ఛ ప్రకారం తన అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వెలువరించిన ఒక రాజకీయ విశ్లేషకుని పోస్టును బాధ్యత గల అమెరికా అధ్యక్షుడు రీపోస్ట్ చేయడమంటే ఆ అధ్యక్షుని మదిలో విదేశీయులపై ఉన్న దురభిప్రాయం ఇట్టే తెలిసిపోతుంది. గతంలో నేను భారతీయులకు మద్దతుదారుడుగా ఉండేవాన్ని. అది ఎప్పటివరకంటే శ్వేత జాతీయులకు కాలిఫోర్నియాలో ఉండే హైటెక్ కంపెనీలలో ఒక్క ఉద్యోగం కూడా రావడం లేదని తెలియనంత వరకు. అక్కడ ఉద్యోగం పొందాలంటే భారత్/ చైనా నుంచి వచ్చిన వారై ఉండాలి అనే పరిస్థితి ఏర్పడింది. ఎందుకంటే ఆ కంపెనీల సీఈవోలందరూ కూడా భారత్/చైనా వారే అని ట్రంప్ పేర్కొన్నారు. ఎంతో కష్టపడి ఎన్నో కలలతో అమెరికా వెళ్లిన భారతీయులు ఇలాంటి పరిస్థితులను జీర్ణించుకోలేక చాలామంది స్వదేశానికి తిరిగి రావాలని అనుకుంటున్నారని సర్వేలో తేలింది.

# 180కి పైగా సీట్లు గెలుస్తాం

మొదటిపేజీ తరువాయి - నియోజకవర్గాల్లో విజయం సాధిస్తుందని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఎగ్జిక్యూటివ్ చీఫ్ కోఆర్డినేటర్ కేఏ సెంగొట్టయాన్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏ పార్టీ కూడా మెజారిటీ సాధించదనే పరిస్థితి ఉండదని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి కావాల్సిన స్థానాలు తాము తప్పకుండా గెలుస్తామని, విజయ్ ముఖ్యమంత్రి అవుతారని అన్నారు. తమ నాయకుడు విజయ్ దూరదృష్టితో పాలన అందిస్తారని పేర్కొన్నారు. 2026 ఎన్నికల విజయం తమకు చారిత్రాత్మకమైనదని అన్నారు. విజయ్ రాత్రనక, పగలనక కష్టపడ్డారని, ఎన్నో పరీక్షలను ఎదుర్కొన్నారని, మే 4న వచ్చే ఫలితమే సమాధానం చెబుతుందని అన్నారు. ఎన్నికల అనంతరం పొత్తు వార్తలను ఆయన కొట్టిపారేశారు. తమకు స్పష్టమైన మెజారిటీ వస్తుందని తెలిపారు. కాగా, ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందని మెజారిటీ ఎగ్జిట్ పోల్ సర్వేలు తెలిపాయి. అయితే విజయ్ ఈ ఫలితాల అనంతరం కింగ్ మేకర్‌గా నిలుస్తారని టుడేస్ చాణక్య, యాక్సిస్ మై ఇండియా అంచనా వేశాయి. అన్నాడీఎంకే నేతృత్వంలోని ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చే అవకాశం లేదని దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ తెలిపాయి. ఈ నేపథ్యంలో, సెంగొట్టయన్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# వాణిజ్య గ్యాస్ ధరల పెంపుపై ప్రధాని మోదీపై షర్మిల ఫైర్

మొదటిపేజీ తరువాయి - షర్మిల, కేంద్ర ప్రభుత్వం మరియు ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఓట్ల కోసం వేషాలు కట్టి, ఎన్నికలు ముగిసిన వెంటనే ప్రజలపై 'బండ బాదుడు' మోపడం మోదీకి అలవాటుగా మారిందని ఆమె ఘాటుగా విమర్శించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత కేంద్రం ఇచ్చిన అతిపెద్ద గిఫ్ట్ ఈ ధరల పెంపేనని షర్మిల ఎద్దేవా చేశారు. వాణిజ్య గ్యాస్ సిలిండర్‌పై ఒకేసారి రూ. 993, 5 కిలోల సిలిండర్‌పై రూ. 549 పెంచిన ఘనత మోదీకే దక్కుతుందని ఆమె అన్నారు. కేవలం ఆరు నెలల్లోనే రూ. 1,513 పెంచడం దేశ చరిత్రలోనే ఇది తొలిసారి అని, ఈ ఏడాదిలోనే ధర 80 శాతం పెరిగిందని ఆరోపించారు. ఈ అద్భుత ఘనకార్యానికి గుర్తుగా దేశంలోని మ్యూజియంలలో మోదీ పేరును సువర్ణాక్షరాలతో రాయించాలని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఈ ధరల పెంపు సామాన్యులకు వాతలు పెట్టడమేనని, బయట తినేవారిపై పెనుభారంగా మారుతుందని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. టీ స్టాల్స్, చిన్న హోటళ్లు నడుపుకునే వ్యాపారుల జీవితాలను అగమ్యగోచరంగా మార్చారని, విద్యార్థులు, వలస కార్మికుల నడ్డి విరిచారని విమర్శించారు. చమురు ధరలు తక్కువగా ఉన్నప్పుడు లాభాలు ఆర్జించిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు ధరలు పెరిగాయని ప్రజలపై భారం వేయడం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు. పెంచిన ధరలను తక్షణం ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నట్లు షర్మిల స్పష్టం చేశారు.

# మునుగోడులో రైతుల ఆవేదన ఉద్ధృతం

వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలి, లేకపోతే భారీ ఉద్యమం: మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

యాదాద్రి భువనగిరి జిల్లా స్టాపర్ **మే 02 నిజం న్యూస్:** మునుగోడు నియోజకవర్గంలోని చండూరు మండల కేంద్రంలో రైతుల సమస్యలు తీవ్రమైన స్థాయికి చేరుకున్నాయి. వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి దాదాపు నెలరోజులు గడిచినా, ఇప్పటికీ కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితులను పరిశీలించేందుకు మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి గారు నేడు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో నేరుగా మాట్లాడారు. రైతుల బాధలను తెలుసుకుని ఆయన ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు

నెలరోజులుగా ధాన్యం కొనుగోలు లేకపోవడం
ఎండ తీవ్రత వల్ల నాణ్యత దెబ్బతినే పరిస్థితి
వర్షాలు పడితే పూర్తిగా నష్టం జరిగే ప్రమాదం
తేమ పేరుతో అన్యాయ కోతలు
అదనపు తూకం (2--3 కిలోలు) వేయడం
గన్నీ బ్యాగులు, తార్పులు లేకపోవడం
తాగునీరు, నీడ వంటి మౌలిక సదుపాయాల కొరత
మధ్యవర్తుల జోక్యం పెరగడం
ప్రభుత్వంపై ప్రభాకర్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు

"రైతులు నెలరోజులుగా రోడ్లపై ఉంటే ప్రభుత్వం ఎక్కడ ఉంది?"
"తేమ పేరుతో ధాన్యం దోపిడీ చేయడం అసహ్యం"
"అధికారులు కేవలం కాగితాలపై మాత్రమే పని చేస్తున్నారు"
"రైతు చెమటకు గౌరవం ఇవ్వాలి -- ఇది ప్రభుత్వ బాధ్యత"

తక్షణ డిమాండ్లు



వెంటనే అన్ని కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు ప్రారంభించాలి
తేమ కొలిచే యంత్రాలను పారదర్శకంగా ఉపయోగించాలి
రైతులకు నామీ ద్వారా సమాచారం అందించాలి
తాత్కాలిక గోడౌన్లు ఏర్పాటు చేయాలి
కనీస మద్దతు ధర (మీఎా) పూర్తిగా చెల్లించాలి
అల్టిమేటం -- భారీ ఉద్యమ హెచ్చరిక
ప్రభాకర్ రెడ్డి గారు ప్రభుత్వానికి కఠిన గడువు విధించారు:
4--5 రోజుల్లో సమస్యలు పరిష్కరించాలి
లేనిపక్షంలో 5,000--6,000 మంది రైతులతో భారీ ధర్నా
మండల నుంచి జిల్లా స్థాయి వరకు ఉద్యమం విస్తరణ

రైతుల ఆవేదన

"మేము అప్పులు చేసి పంట పండించాం. ఇప్పుడు అమ్మడానికి తీసుకువస్తే కొనడం లేదు. ఎండలో పగలు రాత్రి కాపలా కాస్తున్నాం. ప్రభుత్వం వెంటనే స్పందించాలి" అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.




### ఎమ్మెల్యేపై విమర్శలు

ప్రభాకర్ రెడ్డి గారు స్థానిక ఎమ్మెల్యే వైఖరిపై తీవ్రంగా స్పందిస్తూ:

"అధికార పార్టీలో ఉండి స్పందించకపోవడం దారుణం"
"రైతులను మోసం చేస్తున్నారు"
"సోషల్ మీడియా రీల్స్‌కే పరిమితం అవుతున్నారు"
"యూరియా కొరత సమయంలో కూడా రైతుల పక్షాన నిలబడలేదు"

### సారాంశం

మునుగోడులో రైతుల సమస్యలు మరింత తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో, ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యం కొనుగోలు ప్రారంభించకపోతే భారీ స్థాయిలో ఉద్యమం జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ఫిర్యాదు చేసిన మృతుని సోదరుడు తాళ్లపల్లి భరత్

## మధు హత్య పై కేసు నమోదు చేసిన పోలీసులు.

రాజాపేట **మే 02 నిజం న్యూస్:** రాజపేట మండల కేంద్రంలో జరిగిన దారుణ హత్యపై కేసు నమోదు అయింది.. రాజపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మే 1 వ, తేది శుక్రవారం యువకుడి మధుని అతని స్నేహితుడు నాని హత్య చేసినట్లు ఆరోపణలతో కేసు నమోదు అయింది.....పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం,ఫిర్యాదుదారు తాళ్లపల్లి భరత్ (28), వృత్తిరీత్యా డ్రైవర్, స్వగ్రామం రాజపేట కాగా ప్రస్తుతం హైదరాబాద్ మౌలాలి హౌసింగ్ బోర్డ్ కాలనీలో నివసిస్తున్నాడు. ఇతనికి తమ్ముడు తాళ్లపల్లి మధు (25) ఉన్నాడు. మధు పెయింటర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు.భరత్ తన ఫిర్యాదులో తెలిపిన ప్రకారం తమ తల్లిదండ్రులు చాలా సంవత్సరాల క్రితమే ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌కు వలస వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. 2019లో కరోనా లాక్‌డౌన్ సమయంలో కుటుంబ సభ్యులు రాజపేటకు తిరిగి వచ్చి,రాజపేటలోని సాంఘిక సంక్షేమ గురుకుల కాలేజీకి ఎదురుగా కొత్త కాలనీలో ఒక చిన్న ఇల్లు నిర్మించుకున్నారు. ఆ ఇల్లు ఒక్క గది మాత్రమే ఉండడంతో తల్లిదండ్రులు, తమ్ముడు మధు అక్కడే ఉండగా, భరత్ తన భార్యతో కలిసి అద్దె ఇంట్లో నివసించేవాడు.సుమారు ఏడాది క్రితం మధు ఉపాధి కోసం హైదరాబాద్‌కు వెళ్లగా, తల్లిదండ్రులు కూడా అతనితో కలిసి అక్కడే ఉండసాగారు. ఇటీవల పదిహేను రోజుల క్రితం భరత్ కూడా తన




భార్యతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లాడు. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం మధు తన స్నేహితుడు నాని ఆహ్వానం మేరకు రాజపేటకు వచ్చాడు.తదుపరి రోజు మధు, అతని స్నేహితుడు జిడ్డు నాని, బంధువు నవీన్ కలిసి హైదరాబాద్‌కు వెళ్లి కొన్ని దుస్తులు తీసుకుని తిరిగి రాజపేటకు చేరుకున్నారు. ఏప్రిల్ 30వ, తేదీ రాత్రి సుమారు 8 గంటల సమయంలో మధు తన తల్లితో ఫోన్‌లో మాట్లాడి, తాను జిడ్డు నానితో కలిసి రాజపేటలో ఒక ఇంటిలో పెయింటింగ్ పనులు చేస్తున్నట్లు తెలిపాడు. జిడ్డు నాని, మధుతో చాలా కాలంగా స్నేహం ఉందని పేర్కొన్నారు.అయితే మే 1వ, తేదీ శుక్రవారం మధ్యాహ్నం సుమారు 1:40 గంటల సమయంలో జిడ్డు నాని, మధు మధ్య ఏదో విషయంపై గొడవ చోటుచేసుకుని, ఆగ్రహంతో నాని పారతో మధుపై దాడి చేసి హత్య చేసినట్లు సమాచారం. ఈ విషయాన్ని తాళ్లపల్లి బబ్లు అనే వ్యక్తి ఫోన్ ద్వారా భరత్‌కు తెలియజేశాడు.ఈ సమాచారం అందుకున్న వెంటనే భరత్ తన తల్లిదండ్రులు, భార్యతో కలిసి రాజపేటకు చేరుకుని, తమ ఇంట్లో మధు మృతదేహాన్ని గుర్తించారు. హత్యకు గల కారణాలు ఇప్పటికీ తెలియరాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ మేరకు రాజపేట పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిపై కేసు నమోదు చేశారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, పూర్తి వివరాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ ఘటన రాజపేటలో కలకలం రేపింది.

# మెండోర మండల బీసీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగాఏర్పాటు

## రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెల్లడి..

మెండోరా మండల **మే 02 నిజం న్యూస్:** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మండల కేంద్రమైన మెండోర గ్రామంలో గల బీసీ సంక్షేమ సంఘం పార్టీ కార్యాలయంలో శనివారం రోజున మండల బీసీ సంక్షేమ సంఘం నాయకులతో, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి మూర్తి ఆధ్వర్యంలో మండల బీసీ సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బీసీ రిజర్వేషన్ సాధించడం పట్ల పలు అంశాలపై చర్చించారు. అనంతరం మండల బీసీ సంక్షేమ సంఘం నాయకుల అందరి అభిప్రాయం మేరకు మెండోరా మండల బీసీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు చేయడం జరిగిందని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి మూర్తి తెలియజేశారు. మెండోరమండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా గుర్రం మహేష్, మెండోర మండల ఉపాధ్యక్షులుగా బి. మహేందర్, మెండోరా మండల బీసీ సంక్షేమ సంఘం జనరల్ కార్యదర్శిగా టి. హనుమాన్లు తో పాటు నూతన కార్యవర్గాన్ని అందరి అభిప్రాయం మేరకు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నూతన మండల కార్యవర్గం ఏర్పాటు కావడం పట్ల ప్రతి ఒక్కరు స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. మెండోరా



మండల బీసీ సంక్షేమ సంఘం కమిటీ ఏర్పాటును, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి మూర్తి తెలియజేశారు. నూతనంగా ఎన్నికైన మెండోరా మండల బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులను, దాసరి మూర్తి తో పాటు, పలువురు బీసీ సంక్షేమ సంఘం నాయకులు పూలమాలలు వేసి, చాలువలు కప్పి ఘనంగా సన్మానించి, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన మెండోరా మండల బీసీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ, రాష్ట్ర ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ, బీసీ రిజర్వేషన్ అమలుకై ఉద్యమాన్ని



నిరంతరం కొనసాగించి సాధిస్తామన్నారు. అంతేకాకుండా మెండోరా మండలంలో బీసీ సంక్షేమ సంఘాన్ని అన్ని గ్రామాలలో బలోపేతం చేస్తామని, మెండోరమండల నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ రాష్ట్ర శ్యామ్, మెండోరా మండల బీసీ సంక్షేమ సంఘం నాయకులు చాకలి గంగాధర్, ఆసం నరేష్, లక్కంపల్లి రాజేందర్, లక్కంపల్లి గోవర్ధన్, వడ్ల నారాయణ, చాకలి ముత్తన్న, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, సీనియర్ జర్నలిస్ట్ బండి నారాయణ, బిసి సంక్షేమ సంఘం నాయకులు, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ భరత్, పలువురు నూతన కార్యవర్గ సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం...

## అర్హులైన ప్రతి ఇంటికి సంక్షేమ అభివృద్ధి పథకాలు అందిస్తాం...

## ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' సమావేశం...

## రాష్ట్ర నాయకులు వెల్లడి...

భీంగల్ మండల **మే 02 నిజం న్యూస్:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తోందని, అర్హత ఉన్న ప్రతి పేదవాడి ఇంటికి ప్రభుత్వ పథకాలు చేరడమే తమ లక్ష్యమని, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, రాష్ట్ర సహకార సంస్థ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం రోజున నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మండల కేంద్రమైన భీంగల్ పట్టణంలో గల సహస్ర ఫంక్షన్ హాలులో బాల్కొండ నియోజకవర్గ స్థాయి లో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి, భవిష్యత్తు కార్యచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక నియోజకవర్గం నియోజవర్గ స్థాయి లో జరిగిన సమావేశానికి



ముఖ్య అతిథులుగా రాష్ట్ర టి జీఎండిసి చైర్మన్ ఈరవత్రి అనిల్ మాట్లాడుతూ,గత పదేళ్ల పాలనలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను తొలగిస్తూ, ఇందిరమ్మ రాజ్యం ప్రతి గడపకూ చేరుతోందని పేర్కొన్నారు. ప్రజా పాలన ద్వారా స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, రాజకీయాలకు అతీతంగా ప్రతి లబ్ధిదారుడికి అందిస్తూ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ ?మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ,సహకార రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా రైతులకు అండగా ఉంటామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీతో పాటు, ఇతర గ్యారెంటీలను అమలు చేసే దిశగా



వేగంగా అడుగులు వేస్తోందని, నియోజకవర్గంలోని ప్రతి రైతుకూ ప్రభుత్వ భరోసా అందుతుందని వివరించారు. బాల్కొండ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై నేతలు అధికారులతో సమీక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి గ్రామ, మండల కేంద్రాల,ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల కార్యదర్శులు, అన్ని వివిధ శాఖల అధికారులు, మహిళలు, ఆయా గ్రామాల ప్రజలు, వివిధ మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఉన్నతాధికారులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




# ది బాటిల్లె అఫ్ బీట్స్.కార్యక్రమంలో పాల్గొన్న బోనాలమహేష్ లడ్డా

**శేరిలింగంపల్లి మే 02 నిజం న్యూస్: శేరిలింగంపల్లి నియోజకవర్గ మియాపూర్ డివిజన్లో శ్రీ సత్య భారతీ కన్వెన్షన్ సెంటర్‌లో రాజేష్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యాటిల్ ఆఫ్ బీట్స్ హైదరాబాద్ 2026. కార్యక్రమంలో బోనాల మహేష్ లడ్డాపాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ: డాన్స్ పోటీలో పాల్గొన్న డ్యాన్సర్లందరినీ మనస్ఫూర్తిగా అభినందించారు. కళాకారులు తమ ప్రతిభతో రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.యువత ఇలాంటి వేదికలను ఉపయోగించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని డాన్స్ ప్రోగ్రాం లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు.**

# చేనేత, పవర్లూమ్ కార్మికులు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు



రాజపేట **మే 02 నిజం న్యూస్:** రాజపేట మండలం రఘునాథపురం గ్రామంలో సోమవారం నాలుగో తారీఖున ఉదయం 9 గంటల నుండి సాయంత్రం మూడు గంటల వరకు పద్మశాలి భవనంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడుతుంది, ఈ వైద్య శిబిరంలో జనరల్ ఫిజీషియన్ డాక్టర్లు, కంటి డాక్టరు, ఆర్థోపెడిక్ డాక్టర్స్, పాల్గొంటారు. శిబిరంలో అన్ని రకాల రోగాలకు రక్త పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచిత మందులు అందజేస్తారు, కాబట్టి మండలంలోని చేనేత, పవర్లూమ్ కార్మికులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాల్సిందిగా జిల్లా చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు కార్మికులను కోరారు.

# బదిలీపై వెళ్తున్న కమిషనర్ ను సన్మానించిన అధికారులు






భీంగల్ మండల **మే 02 నిజం న్యూస్:** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గ భీంగల్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ గా ఎంతో కాలం ప్రజలకు ఎంతో సేవలు అందించడమే కాకుండ, నిరంతరం విధులు సక్రమంగా నిర్వర్తించారని భీంగల్ మండల ఎంపీడీవో సంతోష్ కుమార్, మున్సిపల్ మేనేజర్ నరేందర్, పలు వివిధ శాఖల అధికారులు అన్నారు. భీంగల్ మున్సిపల్ కమిషనర్ గా విధులు నిర్వర్తించిన గోపు గంగాధర్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా శనివారం రోజున మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, మహిళా సంఘాలు, ప్రజా ప్రతినిధులు, పూలమాలలు వేసి, శాలువాలు కప్పి, ఘనంగా సన్మానించి, సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, అధికారులకు బదిలీలు సహజమేనని, ఏ ప్రాంతానికి వెళ్లిన ప్రజలకు అనుకూలంగా సేవలందిస్తే ప్రజలు ఆదరిస్తారని వారు పేర్కొన్నారు. సన్మాన కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

# భీంగల్ మండల కేంద్రంలో ఎస్.టి.యూనియన్ నూతన కార్యవర్గం ఏర్పాటు




భీంగల్ మండల **మే 02 నిజం న్యూస్:** తెలంగాణ రాష్ట్ర యస్. టీ. యూనియన్ ప్రెసిడెంట్ గా, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయవాది దేవాదస్ నాయక్ సునావత్ ఆదేశాల మేరకు, యస్. టీ. యూనియన్ నిజామాబాద్ జిల్లా ప్రెసిడెంట్ బాణావత్ శ్రీనివాస్ నాయక్ అధ్యక్షతన శనివారం రోజు జరిగిన సమావేశంలో, భీంగల్ మండల కేంద్రంలో నూతన కార్యవర్గం అందరి అభిప్రాయాలకు ఏకంగా ఎన్నుకోవడం జరిగింది. ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడడం జరిగింది. అది రాష్ట్ర అధ్యక్షుడుని దృష్టికి తీసుకెళ్ళి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది. అనంతరం నూతనంగా ఎన్నికైన ఎస్. టి. రాష్ట్ర, భీంగల్ మండల నూతన కార్యవర్గ సభ్యులను, ఎస్. టి. కుల సంఘాల పెద్దలు, నాయకులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి, ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు.ఈ సమావేశంలో మండల్ ప్రెసిడెంట్ బోడ అరుణ్ నాయక్,వైస్ ప్రెసిడెంట్ బాధవత్ లింబాద్రి నాయక్, వైస్ ప్రెసిడెంట్ మాలవత్ శ్రీనివాస్ నాయక్, జనరల్ సెక్రటరీ బాధవత్ భూషణ్ నాయక్, ట్రెజరర్ గా, భూక్యా లింబాద్రి, ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్ ముఖ్య సురేష్, నాగార్జున్ లు, తదితరులు, పాల్గొన్నారు.

# బ్రహ్మకడిగిన పాదము... కోనేటి రాయుడు వైభవం..." భక్తిరసామృతంలో మునిగిన తిరుపతి

## ఆకట్టుకున్న అన్నమయ్య సంకీర్తనల గోష్టిగానం

## ఘనంగా శ్రీ తాళ్లపాక అన్నమయ్య 618వ జయంతి ఉత్సవాల ప్రారంభం





తిరుపతి, **మే 02 నిజం న్యూస్:** వేంకటేశ్వర స్వామివారి పరమభక్తుడైన శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల 618వ జయంతి ఉత్సవాలు శనివారం తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో భక్తి శ్రద్ధలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు, స్థానిక కళాకారులు కలిసి ఆలపించిన సప్తగిరి సంకీర్తనల గోష్టిగానం భక్తులను భక్తిరసంలో ముంచెత్తింది. "బ్రహ్మకడిగిన పాదము...", "కొండలలో నెలకొన్న కోనేటి రాయుడు...", "నారాయణ తే నమో నమో...", "ఎంత మాత్రమున ఎవ్వరు తలచిన...", "హరి అవతారమితడు అన్నమయ్య..." వంటి కీర్తనలు ఆలపించగా సభా వేదిక అంతా ఆధ్యాత్మిక సౌరభంతో నిండిపోయింది. అనంతరం హారతి, మహానివేదనం నిర్వహించారు. సాయంత్రం కార్యక్రమాల్లో భాగంగా తిరుపతికి చెందిన శ్రీమతి అన్నపూర్ణ బృందం సంగీత సభ, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారిణి శ్రీమతి విజయలక్ష్మీ బృందం హరికథ గానం భక్తులను ఆకట్టుకోనున్నాయి.

### మహతి కళాక్షేత్రంలో వైభవం

మహతి కళాక్షేత్రంలో సాయంత్రం గాత్ర సంగీతం, అనంతరం నృత్య కార్యక్రమాలు భక్తులను అలరించనున్నాయి. తిరుపతికి చెందిన కుమారి వేదవ్యాస రంగరాజశ్రీ బృందం సంగీత సభ, శ్రీమతి ధనశ్రీ శ్రీనివాస్ బృందం నృత్య ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి డా. మేడసాని మోహన్, సంచాలకులు డా. లత, కళాకారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. టీటీడీ ముఖ్య ప్రజాసంబంధాల అధికారిచే విడుదల చేయబడినది

# ఆడబిడ్డల పెళ్లి వేడుకలకు పుస్తె-మెట్టెల కానుక

## మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం తిరుమల మహేష్



వనపర్తి బ్యూరో **మే 02 నిజం న్యూస్:** సామాజిక సేవను బాధ్యతగా భావిస్తూ, నిరుపేదల ముఖాల్లో చిరునవ్వు చూడటమే లక్ష్యంగా సాగుతున్న టి.ఎస్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ తిరుమల మహేష్ తన ఉదారతను మరోసారి చాటుకున్నారు. కులమతాలకు అతీతంగా, పేదరికాన్ని మాత్రమే ప్రాతిపదికగా తీసుకుని ఆపదలో ఉన్న ప్రతి ఇంటికి అండగా నిలవడమే ధ్యేయంగా పెట్టుకున్న ఆయన, ఇప్పటివరకు అన్ని వర్గాలకు చెందిన సుమారు 27 మంది ఆడబిడ్డల వివాహ వేడుకలకు మంగళప్రదమైన 'పుస్తె' (బంగారు తాళిబొట్టు) మరియు 'వెండి మెట్టెలను' కానుకగా అందజేసి తన విశాల హృదయాన్ని చాటుకున్నారు.తాజాగా నాగవరం గ్రామానికి చెందిన పసుపుల ఆనంద్ – సుజాత దంపతుల కుమార్తె, నాయి బ్రాహ్మణ ఆడబిడ్డ అపూర్వ వివాహ మహోత్సవానికి కూడా ఈ మంగళప్రదమైన కానుకను అందజేసి ఆ కుటుంబానికి కొండంత భరోసానిచ్చారు. ఏ కష్టం వచ్చినా 'నేనున్నానంటూ' ధైర్యాన్నిచ్చే మహేష్ సేవా దృక్పథం ఎందరికో ఆదర్శం. ఈ సందర్భంగా వనపర్తి పట్టణ నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు అశ్విని చంద్రకుమార్ మాట్లాడుతూ తిరుమల మహేష్ గా కులమతాలకు తావు లేకుండా నిరుపేద కుటుంబాలకు ఒక ఆశీర్వాదం వంటి వారు. ఇప్పటికే 27 మంది ఆడబిడ్డల పెళ్లిళ్లకు పుస్తె, మెట్టెలు అందజేసి ఆ కుటుంబాల్లో సంతోషాన్ని నింపిన మహేష్ మహోన్నత వ్యక్తిత్వానికి హృదయ పూర్వక అభినందనలు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈ సేవా కార్యక్రమంలో వనపర్తి పట్టణ నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు అశ్విని చంద్రకుమార్, జిల్లా అధ్యక్షులు అశ్విని రమేష్, జిల్లా గౌరవ అధ్యక్షులు మాందాపూర్ కృష్ణయ్య , జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకుంట నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిజం
దృష్టి తెలుగు న్యూస్

ఆదివారం 03- 05 - 2026

# 'దురంధర్' తర్వాత ఆర్జీవీ బూస్ట్ ఇచ్చిన మూవీ



మరాఠీ చిత్ర పరిశ్రమలో చారిత్రక కథాంశాలకు ఎప్పుడూ ఒక ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. తాజాగా నటుడు రితేష్ దేశ్‌ముఖ్ స్వీయ దర్శకత్వంలో నటించిన -రాజా శివాజీ- చిత్రం బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు సృష్టిస్తోంది. థియేటర్ల వద్ద కనిపిస్తున్న భారీ రద్దీ, ప్రేక్షకుల్లో పెరుగుతున్న ఉత్కంఠను చూసి ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ (ఆర్జీవీ) సోషల్ మీడియా వేదికగా స్పందించారు. గతంలో -దురంధర్ 2- వంటి చిత్రాలకు తనదైన శైలిలో బూస్ట్ ఇచ్చిన వర్మ ఇప్పుడు -రాజా శివాజీ- ఘనవిజయం సాధిస్తుండటంపై హర్షం వ్యక్తం చేస్తూ రితేష్ దేశ్‌ముఖ్‌ను ప్రశంసలతో ముంచెత్తారు. =శ్రీంశీ =ముఃం - కొరటాల తన మిస్టేక్ ను తెలుసుకున్నారా? వర్మ తన సోషల్ మీడియా పోస్ట్‌లో జెనీలియాకు అభినందనలు తెలియజేస్తూ -రాజా శివాజీ- బాక్సాఫీస్ వద్ద పాత రికార్డులను తిరగరాస్తోందని పేర్కొన్నారు. డైరెక్టర్‌గా - యాక్టర్‌గా రితేష్ థియేటర్లలో విధ్వంసం సృష్టిస్తున్నాడు. ఛత్రపతి శివాజీ మహారాజ్ మళ్ళీ జన్మించారా అన్నంతగా రితేష్ తన పాత్రలో ఒదిగిపోయాడు! అంటూ ఆర్జీవీ ట్వీట్ చేయడం విశేషం. దర్శకుడిగా రితేష్ ప్రతిభను, నటుడిగా ఆయన కనబరిచిన పరిణతిని వర్మ ప్రత్యేకంగా కొనియాడారు. బాక్సాఫీస్ లెక్కల విషయానికి వస్తే... మే 1న విడుదలైన ఈ చిత్రం మొదటి రోజే తన సత్తా చాటుకుంది. మొత్తం 6,192 షోలతో దేశవ్యాప్తంగా దాదాపు రూ. 11.35 కోట్ల నెట్ వసూళ్లను సాధించింది. గ్రాస్ వసూళ్ల పరంగా చూస్తే ఇండియాలో రూ. 13.51 కోట్లతో ఈ చిత్రం ఘనమైన ఆరంభాన్ని అందుకుంది. చారిత్రక నేపథ్యంలో వచ్చే సినిమాలకు సరైన కంటెంట్ తోడైతే ప్రేక్షకులు ఎలా బ్రహ్మరథం పడతారో ఈ చిత్ర ఓపెనింగ్స్ నిరూపించాయి. ఈ సినిమాకు ప్రధానంగా మరాఠీ వెర్షన్ నుండి అద్భుతమైన మద్దతు లభించింది. ప్రాంతీయ భాషలో సుమారు రూ. 8.00 కోట్లు వసూలు చేయడంతో పాటు... 68 శాతం ఆక్యుపెన్సీని నమోదు చేసి రికార్డు సృష్టించింది. అదే సమయంలో హిందీ వెర్షన్ రూ. 3.35 కోట్ల వసూళ్లను రాబట్టింది. హిందీలో ఆక్యుపెన్సీ కొంత తక్కువగా (16 శాతం) ఉన్నా.. సినిమాకు వస్తున్న మౌత్ టాక్ కారణంగా రానున్న రోజుల్లో అక్కడ కూడా వసూళ్లు పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. విమర్శకుల నుండి ఈ సినిమాపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనా సాధారణ ప్రేక్షకులు మాత్రం రితేష్ దేశ్‌ముఖ్ నటనకు ఫిదా అవుతున్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ వంటి ధీరోదాత్తమైన పాత్రను పోషించడంలో రితేష్ చూపిన తెగింపు .. ఆయన దర్శకత్వ ప్రతిభ ప్రేక్షకులను థియేటర్లకు రప్పిస్తోంది. మిశ్రమ స్పందనలు ఉన్నా.. బాక్సాఫీస్ వద్ద ఈ రేంజ్ లో వసూళ్లు రావడం రితేష్ దేశ్‌ముఖ్ సాధించిన అరుదైన విజయంగా చెప్పవచ్చు. అన్ని సినిమాలకు వచ్చినట్టే మిశ్రమ స్పందనలు వచ్చినా రాజా శివాజీ ఓపెనింగ్ వసూళ్లను ఇవేవీ ఆపలేకపోయాయంటే సినిమాలో విజువల్ గ్రాండియారిటీ.. స్టోరి నెరేషన్.. నటీనటుల ప్రదర్శన వర్కవుట్ అయ్యాయనే భావించాలి. తన భర్తతో కలిసి స్వయంగా ఈ సినిమాని నిర్మించిన జెనీలియా భావోద్వేగ ప్రచారం కూడా ఈ సినిమాకి ప్లస్ అయిందని భావించాలి.



# తిరుపతి కుర్రాడైతే ఇంకా బాగుంటుందేమో!



అతిలోక సుందరి శ్రీదేవి తనయ, బాలీవుడ్ హీరోయిన్ జాన్వీ కపూర్ తన మనసులోని ఓ ఆసక్తికర కోరికను బయటపెట్టింది. వివాహం తర్వాత తాను తిరుపతిలో సెటిల్ అవ్వాలని అనుకుంటున్నట్లు వెల్లడించింది. తిరుపతి అందాలను...శ్రీవారిపై తనకున్న భక్తిని చాటి చెబుతూనే పెళ్లి తర్వాత ముంబై వీడితే బాగుంటుందని అభిప్రాయపడింది. మామ్ శ్రీదేవికి తిరుమల వేంకటేశ్వర స్వామికి అమితమైన భక్తురాలు. ఏడాదిలో మూడు నాలుగుసార్లు అయినా కుటుంబంతో శ్రీవారిని దర్శించుకునేవారు. ఇప్పుడా పద్ధతిని జాన్వీకపూర్ వారసత్వంగా ముందుకు తీసుకెళ్తుంది. సోదరి ఖుషీ కపూర్, డాడ్ బోనీకపూర్ లతో కలిసి తిరుపతి కి విచ్చేస్తుంది. ఈనేపథ్యంలోనేతన జీవితంలో అత్యంత కీలకమైన ఘట్టం తర్వాత ఆధ్యాత్మిక నగరిలో ప్రశాంతంగా గడపాలని అమ్మడు ఆశిస్తోంది. జాన్వీ వ్యాఖ్యలు నెట్టింట వైరల్ అవ్వడంతో? అభిమానులు మరో అడుగు ముందుకేసి సరికొత్త చర్చకు తెరలేపారు. జాన్వీకి తిరుపతికి చెందిన కుర్రాడే భర్తగా దొరికితే ఆమె కోరిక మరింత సులువుగా నెరవేరుతుందనే కామెంట్లు చేస్తునన్నారు. అత్తగారి ఊరు తిరుపతి అయితే ఆమెకు ఆ నగరంతో ఉన్న అనుబంధం మరింత బలపడుతుందని శ్రీవారి సేవలో తరించే భాగ్యం నిరంతరం దక్కుతుందని నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు. ముంబై బినిజెస్ మ్యాన్...ఓ పెద్ద నటుడు కంటే? జాన్వీ స్థానికంగా ఉండే తిరుపతి వాసిని పెళ్లి చేసుకుంటే? మరింత బాగుంటుందంటూ కామెంట్లు పెడుతున్నారు. మరి ఈ కామెంట్లపై జాన్వీ ఎలా స్పందిస్తుందో చూద్దాం. శ్రీదేవి కుటుంబానికి తిరుమలతో దశాబ్దాల అనుబంధం ఉంది. ఏ చిన్న సందర్భం వచ్చినా ఆ కుటుంబం తిరుమలకు వచ్చి స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీ. జాన్వీ కపూర్ కూడా ప్రతి తన పుట్టినరోజున లేదా సినిమా ప్రారంభోత్సవాల సమయంలో సాంప్రదాయబద్ధంగా పట్టుచీర కట్టుకుని కొండపైకి కాలినడకన వెళ్తుంది. తిరుపతిపై ఆమెకున్న మమకారం కేవలం భక్తి మాత్రమే కాదు. తన తల్లి జ్ఞాపకాలతో ముడిపడి ఉన్న ఒక భావోద్వేగం. తిరుపతిపై జాన్వీ కపూర్ కున్న ప్రత్యేక అభిమానం తెలుగు ప్రజలకు మరింత దగ్గర చేస్తోంది. స్టార్ హీరోయిన్ అయి ఉండి కూడా గ్లామర్ ప్రపంచానికి దూరంగా ఆధ్యాత్మిక వాతావరణంలో స్థిరపడాలనుకోవడం విశేషం. భవిష్యత్తులో నిజంగానే తిరుపతి కుర్రాడు ఆమెకు భర్తగా దొరికి తిరుపతి కోడలిగా మారితే పెద్ద సంచలనమే అవుతుంది. ప్రస్తుతం జాన్వీ కపూర్ కెరీర్ పరంగా ఎంతో బిజీగా ఉంది. తెలుగులో రామ్ చరణ్ - బుచ్చిబాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న -పెద్ది- సినిమాలోనూ హీరోయిన్‌గా నటిస్తోంది. బాలీవుడ్ లో కూడా వరుస సినిమాలతో బిజీగా ఉంది. అయితే ఫోకస్ అంతా మాత్రం టాలీవుడ్ పైనే ఉంది. తెలుగు సినిమా పాన్ ఇండియాలో సత్తా చాటుతోన్న తరుణంలో ఇక్కడే చక్రం తిప్పాలని చూస్తోంది.

## నాగబాబు ప్రధాన పాత్రలో సరికొత్త సిరీస్.. ఓటీటీలో స్ట్రీమింగ్.. ఎప్పటి నుంచంటే..

చాలా కాలం తర్వాత నాగబాబు ప్రధాన పాత్రలో నటిస్తున్న సిరీస్ మేము 'కాప్'లం. తాజాగా పోలీస్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కిన యాక్షన్ డ్రామా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సిరీస్ త్వరలోనే ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ జీ5లో స్ట్రీమింగ్ కానుంది. పేరులోనే ఉన్నట్లుగా ఇది పోలీసుల జీవితాల చుట్టూ తిరిగే కథ. కేవలం నేరస్తులను పట్టుకోవడం మాత్రమే కాకుండా, ఖాకీ యూనిఫామ్ వెనుక ఉండే మనుషుల భావోద్వేగాలు, వారు ఎదుర్కొనే వత్తిడి, వృత్తిపరమైన సవాళ్లు చూపించనున్నారు. వైవిధ్యమైన కంటెంట్‌తో ప్రేక్షకులకు కావాల్సిన ఎంటర్‌టైన్మెంట్‌ను అందిస్తోన్న టాప్ ఓటీటీ ఫ్లాట్‌ఫామ్ జీ5 ఇప్పుడు మరో కొత్త సిరీస్ స్ట్రీమింగ్ డేట్‌ను అనౌన్స్ చేసింది. అదే "మేము 'కాప్'లం". కామెడీ, మిస్టరీ కలయికగా రూపొందిన ఈ సిరీస్ అందరినీ మెప్పించే కథాంశంతో రూపొందుతోంది. గ్రామీణ నేపథ్యంలో, అక్కడి రోజువారీ జీవితం, స్థానిక రాజకీయాలు, ఊహించని గందరగోళం..ఇలా అన్నీ కలగలిపిన ఆసక్తికరమైన కథతో ఈ సిరీస్ తెరకెక్కుతోంది. తాజాగా సిరీస్ టైటిల్‌ను మేకర్స్ ఓ స్పెషల్ వీడియో ద్వారా రిలీజ్ చేసిన సంగతి తెలిసిందే. అందులో గెటప్ శ్రీను, జాఫర్ కనిపించారు. ఆ వీడియో అన్నీ ఫ్లాట్‌ఫామ్స్‌లో వైరల్‌గా మారి.. ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. రా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై బి.వి.ఎస్. రవి, కౌముది కె నేమాని నిర్మాతలుగా ప్రదీప్ మద్దాలి క్రియేటివ్‌తో కలిసి రూపొందుతున్న "మేము కాప్'లం" సిరీస్‌కు 'వికటకవి' డైరెక్టర్ ప్రదీప్ మద్దాలి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సిరీస్‌కి శోభన్ చిట్టుప్రోలు కథను అందించారు. ఇందులో నాగబాబు కొణిదెల ప్రధాన పాత్రలో కనిపిస్తున్నారు. గెటప్ శ్రీను, రవితేజ నన్నిమాల కీలక పాత్రల్లో నటించారు. చక్కటి నటన, కామెడీ టైమింగ్‌తో వీరు ప్రేక్షకులను మెప్పించనున్నారు. గోదావరి జిల్లాల్లోని ఓ గ్రామంలో సంక్రాంతి పండుగ నేపథ్యంలో జరిగే కథ ఇది. అక్కడ ఒక విచిత్రమైన ఘటన జరగడంతో గ్రామంలో గందరగోళం ఏర్పడుతుంది. ఆ కేసును విచారించడానికి ఇద్దరు పోలీసుల ద్వయం రంగంలోకి దిగుతారు. వారికి ఇదే ఫస్ట్ బిగ్ కేస్ అవుతుంది. ఆ ఇద్దరూ ఎంతో కాన్ఫిడెంట్‌గానే ఉంటారు కానీ కాస్త టెన్షన్‌గా ఫీల్ అవుతుంటారు. అక్కడ వారికి దొరికే క్లూస్, ఆ తరువాత జరిగే పరిణామాలు అన్నీ కూడా వినోదాత్మకంగా మారుతాయి. ప్రతీ ఒక్కరిపై అనుమానం రావడంతో అంతా గందరగోళంగా మారుతుంది. చిన్న ఘటనతో అక్కడి వాతావరణం అంతా మారిపోతుంది. అవేంటనేవి తెలుసుకోవాలంటే మాత్రం సిరీస్ చూడాల్సిందే. లోకల్ ఫ్లేవర్‌తోబలమైన పాత్రల చుట్టూ తిరిగే కథనం, వ్యంగ్యమైన కనిపించే కథా పాత్రలతో "మేము కాప్'లం" తెలుగ్గ జుజు5 ఒరిజినల్స్‌లో మరోసారి ప్రేక్షకులను మెప్పించే వెబ్ సిరీస్‌గా కనిపించనుంది. మనం ఎప్పుడూ చూసే, మనల్ని ప్రతిబింబించే కథలను ఆధునిక మేళవింపుతో చూపించే జీ5 ప్రాజెక్ట్‌ల జాబితాలో ఇది ఒకటిగా మారనుంది. ఈ సందర్భంగా నాగబాబు కొణిదెల మాట్లాడుతూ ""పరువు' తర్వాత జీ5లో నేను చేస్తోన్న సిరీస్ "మేము కాప్'లం". కథా నేపథ్యం, పాత్రలు, ఆసక్తికరమైన కథనం వల్ల నాకు బాగా నచ్చింది. ఈ టీమ్‌తో పని చేయడం చాలా సంతృప్తికరంగా అనిపించింది. హాస్యాన్ని, అర్థవంతమైన స్థానిక కథలను బ్యాలెన్స్ చేసే ఈ సిరీస్‌లో భాగం కావటం నాకు సంతోషంగా ఉంది. త్వరలోనే ఈ సిరీస్ జీ5లో స్ట్రీమింగ్ కానుంది" అన్నారు.

# కమెడియనా? హీరోనా?.. సత్య ఒపీనియన్ ఏంటి?

అక్కడే ఉన్న నిర్మాత మాత్రం సత్యపై పూర్తి నమ్మకాన్ని వ్యక్తం చేశారు. సత్య ఒక హీరో ఇమేజ్ ఉన్న కమెడియన్ అంటూ ఆయనకు మద్దతుగా నిలిచారు.

టాలీవుడ్ లో తనదైన కామెడీ స్టైల్ తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు సత్య గురించి మరోసారి ఆసక్తికరమైన చర్చ మొదలైంది. అసిస్టెంట్ డైరెక్టర్ గా కెరీర్ ను ప్రారంభించిన సత్య, నెమ్మదిగా కమెడియన్ గా ఎదిగి ఇప్పుడు స్టార్ కమెడియన్ గా మారారు. స్వామి రారా, ఛలో, మత్తు వదలరా, మత్తు వదలరా 2 వంటి సినిమాలు ఆయనకు మంచి క్రేజ్ ను తీసుకొచ్చాయి. తన స్పెషల్ డైలాగ్ డెలివరీ, ఎక్స్ప్రెషన్స్ తో ప్రేక్షకులను నవ్వించడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. ఇటీవల దర్శకుడు రితేష్ రానా తెరకెక్కించిన జెట్లీ సినిమాలో సత్య లీడ్ రోల్ లో నటించారు. ఇప్పటికే వివాహ భోజనంబు సినిమాతో హీరోగా ప్రయత్నించిన ఆయన, జెట్లీతో మరోసారి లీడ్ రోల్‌లో కనిపించారు. మే 1వ తేదీన థియేటర్స్ లో ఆ సినిమా రిలీజ్ అవ్వగా.. ఇప్పుడు పోస్ట్ ప్రమోషన్స్ లో భాగంగా నిర్వహించిన ప్రెస్ మీట్ లో సత్య చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. ప్రెస్ మీట్ లో ఓ మీడియా ప్రతినిధి సత్యను.. మిమ్మల్ని మీరు హీరోగా ఎందుకు అంగీకరించలేకపోతున్నారని ప్రశ్నించగా, ఆయన ఆసక్తికరంగా స్పందించారు. 'నేను కామెడీ చేస్తూ హీరో కానీ.. సెపరేట్ గా హీరో ఏం కాదు' అని స్పష్టంగా చెప్పారు. ఆ వ్యాఖ్యలతో సత్య తనను తాను హీరోగా కాకుండా కమెడియన్ గా చూడాలనే భావనను వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అదే సమయంలో జెట్లీ సినిమా ఒక ఎక్స్పెరిమెంటల్ ప్రాజెక్ట్ అని కూడా ఆయన వివరించారు. అక్కడే ఉన్న నిర్మాత మాత్రం సత్యపై పూర్తి నమ్మకాన్ని వ్యక్తం చేశారు. సత్య ఒక హీరో ఇమేజ్ ఉన్న కమెడియన్ అంటూ ఆయనకు మద్దతుగా నిలిచారు. అంటే సత్యకు హీరోగా నిలబడే స్టామినా ఉందని నిర్మాత అభిప్రాయపడ్డారు. ఇక జెట్లీ సినిమాలో సత్య నటనకు మంచి స్పందన వస్తోంది. ఆ చిత్రంలో ఆయన వన్ మ్యాన్ షో చూపించారని సినీ ప్రియులు అభిప్రాయపడుతున్నారు. సినిమా మొత్తం కథ, స్క్రీన్ ప్లే కంటే సత్య పెర్ఫార్మెన్స్ నే మోసుకెళ్లిందని చెబుతున్నారు.



# మీమ్స్‌పై ఫరియా అబ్దుల్లా రియాక్షన్.. అస్సలు ఊహించరలేదు భయ్యా!

దీనిపై ఆమె స్పందిస్తూ.. "నిజం చెప్పాలంటే ఆ వీడియోలో నేను లేకపోయి ఉంటే, ఆ మీమ్స్ చూసి నేనే అందరికంటే ఎక్కువగా నవ్వుకునేదాన్ని.



టాలీవుడ్‌లో 'చిట్టి' అంటే తెలియని వారుండరు. తన పొడుగు కాళ్లతో, అమాయకపు చూపులతో 'జాతిరత్నాలు' సినిమాలో అందరినీ ఆకట్టుకున్న ఫరియా అబ్దుల్లా, ఇప్పుడు సోషల్ మీడియాలో మరోసారి సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ అయ్యింది. సాధారణంగా సెలబ్రెటీలు తమపై వచ్చే ట్రోల్స్ లేదా మీమ్స్ చూసి ఫీలవుతుంటారు. కానీ మన హైదరాబాదీ భామ మాత్రం చాలా కూల్‌గా స్పందించింది. తనపై వస్తున్న మీమ్స్‌ను చూసి తానే నవ్వుకున్నానని చెబుతూ ఆమె చేసిన కామెంట్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. సక్సెస్ జోష్‌లో ఫరియా: రీసెంట్‌గా విడుదలైన 'గాయపడ్డ సింహం' మూవీతో ఫరియా అబ్దుల్లా మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఈ సినిమాలో తన నటనతో ప్రేక్షకులను మెప్పించడమే కాకుండా, తరుణ్ భాస్కర్‌తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం విశేషం. ప్రస్తుతం ఈ మూవీ థియేటర్లలో పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సినిమా ప్రమోషన్ల కోసం ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఫరియా తన గురించి వస్తున్న మీమ్స్ ప్రస్తావన రాగానే ఎంతో సరదాగా స్పందించింది. ఆ వీడియో చూసి నాకే నవ్వొచ్చింది: సోషల్ మీడియాలో ఫరియా మాట్లాడిన కొన్ని పాత వీడియోలను కట్ చేసి మీమ్స్ క్రియేట్ చేస్తున్నారు నెటిజన్లు. దీనిపై ఆమె స్పందిస్తూ.. "నిజం చెప్పాలంటే ఆ వీడియోలో నేను లేకపోయి ఉంటే, ఆ మీమ్స్ చూసి నేనే అందరికంటే ఎక్కువగా నవ్వుకునేదాన్ని. కానీ అక్కడ ఉన్నది నేనే కాబట్టి కొంచెం వింతగా అనిపించింది. నేను అలా మాట్లాడకుండా ఉండాల్సింది అనిపించింది" అంటూ నవ్వేసింది. తన తప్పును కూడా ఇంత సరదాగా ఒప్పుకోవడం ఫ్యాన్స్‌కు బాగా నచ్చింది. ఇకపై జాగ్రత్తగా ఉంటా: మీమ్స్ వల్ల వచ్చే పాపులారిటీని ఎంజాయ్ చేస్తూనే, ఒక కీలక నిర్ణయం తీసుకున్నట్లు ఫరియా వెల్లడించింది. "ఇక మీదట నేను కెమెరా ముందు మాట్లాడేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. లేదంటే ఇలాంటి వెరైటీ మీమ్స్ పుట్టుకొస్తూనే ఉంటాయి" అని చమత్కరించింది. సాధారణంగా హీరోయిన్లు ఇలాంటి విషయాల్లో సీరియస్ అవుతుంటారు, కానీ ఫరియా మాత్రం తనపై వచ్చిన జోకులను ఎంజాయ్ చేస్తూ స్పోర్టివ్ నెస్‌ను చాటుకుంది. ఫ్యాన్స్ ఫిదా ఫరియా ఇచ్చిన ఈ కూల్ రియాక్షన్‌కు నెటిజన్లు ఫిదా అయిపోతున్నారు. "నువ్వు చాలా గ్రేట్ చిట్టి", "ఏమాత్రం ఇగో లేకుండా మాట్లాడావు" అంటూ కామెంట్స్ చేస్తున్నారు. కేవలం నటనలోనే కాదు, రియల్ లైఫ్ లో కూడా ఫరియా చాలా సెన్సిబుల్ అని ఈ ఇంటర్వ్యూతో మరోసారి ప్రూవ్ అయ్యింది. తన హైట్ లాగే ఆమె ఆలోచనలు కూడా చాలా ఎత్తులో ఉన్నాయని ఫ్యాన్స్ మురిసిపోతున్నారు. మొత్తానికి 'గాయపడ్డ సింహం' సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న ఫరియా అబ్దుల్లా, తన ఫన్నీ మాటలతో అందరినీ అలరిస్తోంది. సోషల్ మీడియా ట్రోల్స్‌ను కూడా పాజిటివ్‌గా తీసుకోవడం అనేది గొప్ప విషయం. రాబోయే రోజుల్లో మరిన్ని వైవిధ్యమైన పాత్రలతో ఈ హైదరాబాదీ చిన్నది తెలుగు ప్రేక్షకులను ఇంకా ఏ స్థాయిలో మెప్పిస్తుందో చూడాలి. ఆల్ ది బెస్ట్ చిట్టి!

Ho no:LIG-32,, Ph No:- 9247842354, 9059207979,near water tank, Bharat Nagar colony, moos-apet, Hyderabad, pin code 500018.